ప్రజాశక్తి
శుక్రవారం 16 జూన్ 2023
5
అనంతపురం

విత్తనాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

విత్తన దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని పలు విత్తనాల దుకాణాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రావణి ఎంటర్‌ప్రైజస్ విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. నాణ్యత లేని విత్తనాలు, అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే విత్తనాలను అమ్మిన షాపులను సీజ్ చేస్తామన్నారు. ప్రతి షాప్ యజమాని తప్పకుండా స్టాక్ రిజిస్టర్లను నిర్వహించాలన్నారు.

శ్రావణి సీడ్స్‌పై 6ఎ కేసు నమోదు

నగరం లోని శ్రావణి ఎంటర్ ప్రైజస్ దుకాణంలో జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన కుసుంభర్ కళాశా రెండు కిలోలు, కళాశా బెండ సీడ్ 56 కేజీలు, కళాశా కళింగర విత్తనం ఎనిమిది కిలోలు, లేపాక్షి అగ్రిజెనిటిక్స్ కంది విత్తనం 249 కిలోలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.9.40 లక్షల విలువైన విత్తనాన్ని సీజ్ చేయడమే గాకుండా శ్రావణి సీడ్స్ దుకాణంపై 6ఎ కేసు నమోదు చేసినట్లు అనంతపురం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.రవి, ఏవో.శశికళ తెలిపారు.

రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనాలను అందించాలి

రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలు అందించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ వ్యవసాయ అధికారులనుకు ఆదేశించారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ నగరంలోని హిమబిందు వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. విత్తన నాణ్యతను పరిశీలించారు. విత్తన ప్రాసెసింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించాని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రవి, ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, అనంతపురం మండల వ్యవసాయ అధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.

లోకల్... నాన్‌లోకల్..!

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో లోకల్, నాన్ లోకల్ వివాదం రాజుకుంటోంది. అధికారపార్టీలో మొదలైన అసమ్మతి రాగం ఇప్పుడు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి తాకుతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ ఈ అంశం తెరపైకి వస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ వచ్చిన నినాదం ఇప్పుడూ మొదలైంది. అది సొంత పార్టీల నుంచే వస్తుండటం గమనార్హం.

- తెరపైకి స్థానికత అంశం
- ఎన్నికలకు ముందు మొదలైన నినాదాలు
- వైసిపి, టిడిపి రెండింటిలోనూ ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం వైసిపిలో ఇన్‌ఛార్జీగానున్న మహమ్మద్ ఇక్బాల్‌కు స్థానిక వైసిపి నాయకులే స్థానికేతరులంటూ నాన్‌లోకల్ సమస్యను ముందుకు తెచ్చారు. ఐపిఎస్ రిటైర్డు ఉద్యోగి అయిన మహమ్మద్ ఇక్బాల్ 2019 ఎన్నికలకు ముందు హిందూపురం నియోజకవర్గానికి వైసిపి టిక్కెట్టు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆయన పోటీచేసి ఓటమి చెందారు. అయితే ఆ తరువాత కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఉన్నప్పటికీ స్థానిక నాయకులకు, ఆయనకు మధ్య విభేదాలు కొనసాగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనకు వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్టు ఇవ్వాలని మైనార్టీలు ప్రదర్శనలు చేపట్టారు. ఈ సమయంలో ఆయన స్థానికేతరుడంటూ అసమ్మతివర్గం పాత నినాదాన్నే మరోమారు ముందుకు తీసుకొచ్చింది. ఇక్కడ మొదలైన ఈ నినాదం క్రమంగా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తోంది. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గంలోనూ మంత్రి ఉషచరణ్ శ్రీకి వ్యతిరేకంగా అసమ్మతి గ్రూపు నాన్ లోకల్ నినాదాన్ని తీసుకొచ్చింది. స్థానికులకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వాలన్న డిమాండ్‌ను వినిపిస్తోంది. ఉషచరణ్ శ్రీ 2019 ఎన్నికలకు ముందే వైసిపిలో చేరారు. మొదటి ఎన్నికలోనే గెలుపొందారు. ఆ తరువాత మంత్రి అయ్యారు. మంత్రి కూడా మొదటి స్థానిక ద్వితీయ శ్రేణి నాయకులకు, ఆమెకు మధ్య గ్రూపు తగాదాలున్నాయి. అసమ్మతి గ్రూపు ఇప్పుడు నాన్‌లోకల్ అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఇది ఇంతటితోనే ఆగుతుందా లేక పార్లమెంటు సభ్యుల వరకు పాకుతుందా అన్న చర్చ రాజకీయాల్లో సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనున్న అనంతపురం, హిందూపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్ ఇద్దరూ కర్నూలు జిల్లాకు చెందిన వారు. వీరి విషయంలోనూ ఈ అంశం ప్రస్తావనకు వస్తూనే ఉంది. అయితే పై ఇద్దరూ జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేయడంతో ఇక్కడి వారేనన్నట్టుగా ఉన్నప్పటికే రాజకీయాల్లో మాత్రం ప్రతి అంశం వివాదాస్పదం అవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. లోకల్, నాన్‌లోకల్ అంశం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోనూ చర్చకు వస్తుండటం గమనార్హం. ప్రధానంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఈ అంశంపై వివాదం నడుస్తోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జీగానున్న ఉమామహేశ్వరనాయుడు బెళుగుప్ప మండల వాసిగానున్నారు. ఈ మండలం ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. ఆయన కళ్యాణదుర్గంలోనే ఉంటున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరికి ఆయనకు మధ్య సఖ్యత లేదు. తరచూ వివాదాలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు వచ్చేసరికి ఇటువంటి అంశాలు మరిన్ని ముందుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు పార్టీల్లోనూ సొంత పార్టీ నాయకుల నుంచే స్థానికత అంశం ముదురుతుండటంతో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి.

'అనంత'లో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

- జులై 12 నుంచి 14 వరకు సమావేశాలు
- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు

అనంతపురం నగరంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జులై 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. ఈ కమిటీ సమావేశాల సందర్భంగా నగరంలో పలు కార్యాక్రమాలను సిపిఎం చేపట్టినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ గురువారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు.

వార్త మెయిన్‌లో..

44,747 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యాప్తంగా 59,707మంది రైతులకు 44,747 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆర్‌బికెల్లో విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకూ నాణ్యమైన వేరుశనగ కాయలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగుతోందన్నారు.

భాస్కర్ ఫర్టిలైజర్స్‌లో కేంద్ర బృందం తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని భాస్కర్ ఫర్టిలైజర్స్ కంపెనీలో ఢిల్లీ కేంద్ర బృందం సభ్యులు గురువారం తనిఖీలు చేపట్టింది. ఢిల్లీ నుంచి వచ్చిన గోవింద్ మీన, ప్రవీణ్ జిడి, ఆనంతకు చేరుకుని భాస్కర్ ఫర్టిలైజర్ మ్యాన్‌ఫ్యాక్చర్ కంపెనీని తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ సాంపుల్స్‌ను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ ఎం.రవి, సింగణమల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్ కుమార్, గార్లదిన్నె మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, సాంకేతిక వ్యవసాయ అధికారి కె.సాయి లక్ష్మి, పాల్గొన్నారు.

రచ్చబండపై ఎమ్మెల్యే సమావేశం

ప్రజాశక్తి-యాడికి

త్వరలో జరగనున్న రచ్చబండ కార్యక్రమంపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులతో గురువారం సమావేశం అయ్యారు. రచ్చబండ నిర్వహణపై వీరితో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, సర్పంచి కాసా చంద్రమోహన్, బ్రహ్మానంద రెడ్డి, బలా రమేష్, వెంకట నాయుడు, తలారి నగేష్, రషీద పాల్గొన్నారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం : విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో గురువారం వజ్రకరూరు, ఉరవకొండ ఎంఇఒలు ఎర్రిస్వామి, ఈశ్వరప్ప అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం 2022-23లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పవన్ కుమార్, సాయి గోపాల్‌నాయక్, శశాంక్, యాసిన్, ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన దేవీ, స్రవంతి, పూజిత, వహీదలకు జ్ఞాపికలు, మెడల్స్ పురస్కారాలతో పాటు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పద్మజ, ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, సర్పంచి లలిత, ఉపసర్పంచి వన్నప్ప, మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపళ్లు, ఉపాధ్యాయులు, స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎపిఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర ఆధ్వర్యంలో గురువారం నాడు డిఈవో సాయిరాంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలన్నీ నిబంధనలకు విరుద్ధంగా వేల, లక్షలాది రూపాయలను ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు. బుక్స్, యూనిఫామ్‌ను పాఠశాలల్లోనే అధికార ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఇలాంటి విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుండా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఎఫ్ నాయకులు సుబ్రహ్మణ్యం, నగర అధ్యక్షులు గురుసాయి, శ్రీకాంత్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గుంతకల్లులో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపాలిటీల్లో ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలతో పాటు రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18500 వేతనం చెల్లించాలన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలన్నారు. పని ముట్లు కొబ్బరి నూనె చెప్పులు, యూనిఫామ్స్ సంవత్సరాల తరబడి ఇవ్వడం లేదన్నారు. పట్టణాల సుందరీకరంగా ఉండి ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పని ముట్లు సకాంలో ఇస్తేనే నగరాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు పని గంటలకంటే అధికంగా పని గంటలు పని చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యం, నీరు అందిస్తూ మున్సిపల్ కార్మికులు చీకట్లో మగ్గుతున్నారని తెలిపారు. కార్మికుల వేతనాల నుంచి కోత విధిస్తున్న పిఎఫ్, ఇఎస్‌ఐ కార్మికుల ఖాతాల్లో సక్రమంగా జమ కావడం లేదన్నారు. ఇఎస్‌ఐ ద్వారా వైద్యం అందక కార్మికులు, వారి కుటుంబాలు ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని తెలిపారు. పట్టణ విస్తీర్ణం జనాభాకు అనుగుణంగా కార్మికులను నియమించక పోవడంతో ఉన్న కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలం ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. మృతి చెందిన కార్మికులకు వారి వేతనం నుంచి కోతలు విధించిన ఈపిఎఫ్, డెత్ బెనిఫిట్స్ దశాబ్దాల తరబడి ఇవ్వకుండా నాన్చుతున్నారని విమర్శించారు. అనంతరం ఆయా మున్సిపల్ కమిషనర్లకు నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మినరసమ్మ, లక్ష్మినారాయణ, శేషేంద్రకుమార్, ఎమ్మార్పీస్ నాయకులు నల్లప్ప, ముత్యాలమ్మ, ముత్తు, శివ పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.నరసయ్య, కార్యదర్శి ఎన్.రంగనాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నంతరం మున్సిపల్ మేనేజర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశా రు. కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తిమ్మప్ప, జగదీష్, కృష్ణ, ఆనంద్, వెంకటేశులు, లింగమూర్తి, ప్రేమ్ కుమార్, మహిళా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాల ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు గంట పాటు ధర్నా చేపట్టారు. అనంతరం కార్మికులతో కలిసి మేనేజర్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, మల్లేష్, వెంకటేశులు, సిద్ధ, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, వన్నూరుస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

హమాలీలను ఇబ్బందులు పెడితే సహించం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐఎంఎల్ డిపో వద్ద చేపట్టిన నిరసనలో మాట్లాడుతున్న ఎస్.నాగేంద్రకుమార్

బేవరేజ్ హమాలీల సమస్యలను పరిష్కరించడంలో మద్యం కంపెనీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామేశ్వరరావు అనుసరిస్తున్న వైఖరి సరికాదని, హమాలీ అసోసియేషన్ నేతలపై ఆయన దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. హమాలీ యూనియన్ నేతల పట్ల మద్యం కంపెనీల అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వరరావు అనుసరించిన వైఖరిని తప్పుపడుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో సోములదొడ్డి ఐఎంఎల్ డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 2023 జూన్ 14వ తేదీకి హమాలీ దిగుమతి కూలిరేట్లు ఒప్పందం చేసుకునే విషయంపై విజయవాడకు వస్తానని కామేశ్వరరావు 10-06-2023వ తేదీన బేవరేజ్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావుకు నేరుగా లేఖ వాట్సప్ ద్వారా పంపించారన్నారు. ఆ మేరకు 14వ తేదీన సమావేశానికి వస్తున్నారా అంటూ ఉమా మహేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారని, కూలీ రేట్ల పెంపుదలలో 60 పైసలు పెంపుదల చేస్తామని, ఆ మేరకు సంఘం నేతలు ఒప్పుకుంటేనే సమావేశానికి వస్తానంటూ కామేశ్వరరావు లేకపోతే రానంటూ షరతులు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. సంఘాల నుంచి అభిప్రాయం తెలియజేయలేదంటూ సాకులు చెప్పి సమావేశానికి రాలేదన్నారు. ఒప్పందం చేసుకునే సమయంలో తొలుత చర్చలు జరిపిన తరువాతనే ఏదైనా నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం ఆనవాయితీ అన్నారు. హమాలీల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం మద్యం కంపెనీ అసోసియేషన్ నాయకుడిగా కామేశ్వరరావుకి మంచిదికాదన్నారు. కామేశ్వరరావు వైఖరి మార్చుకుని సంఘం నేతలకు క్షమాపణలు చెప్పి సమావేశానికి హాజరై హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కూలీ రేట్లు పెంచాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేవరేజ్ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు రామాంజినేయులు, అధ్యక్ష కార్యదర్శులు మోహన్‌రెడ్డి, నాగార్జున, నాయకులు అంజనేయులు, చెన్నారెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

5.2 కిలోల శిశువు జననం

కడుపు భారీగా ఉన్న మహిళకు కిమ్స్ సవీరాలో శస్త్రచికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

5.2 కిలోల జన్మించిన శిశువుతో కిమ్స్ సవీరా వైద్యులు

సాధారణంగా పుట్టిన శిశువు బరువు 2.5 నుంచి 4 కిలోల వరకు ఉంటుంది. ప్రత్యేక సందర్భాల్లో 3 నుంచి 3.5 కిలోలు సగటు బరువుగా చెబుతుంటారు. అనంతపురం జిల్లాలో తొలిసారిగా 5.2 కిలోల బరువున్న శిశువు జన్మించాడు. గురువారం నాడు కిమ్స్ సవీరాలో వైద్యులు గర్భిణి మహిళకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కాన్పు చేయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ శిల్పా చౌదరి తెలిపారు. ధర్మవరానికి చెందిన 30 ఏళ్ల వయసున్న మహిళ ఉమ్మనీరు బాగా ఎక్కువ ఉందని, పొట్ట బాగా ఉబ్బిందని, బీపీ ఎక్కువగా ఉండడంతో కాన్పు నిమిత్తం కిమ్స్ సవీరాకు వచ్చారు. ఆమె భర్త ఆ ప్రాంతంలో రోజుకూలీగా పనిచేస్తుంటారు. ఈమెకు స్కాన్ చేసి చూస్తే గర్భస్థ శిశువు బరువు ఎక్కువగా ఉండటంతో పాటు ఉమ్మనీరు కూడా చాలా ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. సాధారణంగా 5 సెంటీమీటర్ల స్థాయిలో ఉండే ఉమ్మనీరు ఏకంగా 28 సెంటీమీటర్లు ఉంది. బాగా హైరిస్కు కేసు కావడంతో వెంటనే చేర్చుకుని వైద్య పరీక్షలను చేశారు. మహిళ పొట్ట పొట్ట బాగా ఉబ్బిపోయి మెడవరకు వచ్చింది. కాగా ఈ మహిళ మొదటిసారి గర్భం దాల్చినప్పుడు మధుమేహం, రక్తపోటు మొదలయ్యాయి. ఇప్పుడు ప్రసవానికి వచ్చేసరికి కూడా మధుమేహం, రక్తపోటు చాలా ఎక్కువ స్థాయిలో ఉన్నాయి. మహిళ, బిడ్డను రక్షించేందుకు తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సి వచ్చింది. ప్రసవం తరువాత బాబు 5.2 కిలోలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ముందు జాగ్రత్తగా ఈ బిడ్డను 10 రోజుల పాటు ఎన్ఐసియులో ఉంచారు. తల్లీబిడ్డలకు ఎటువంటి సమస్యలూ లేకపోవడంతో గురువారం నాడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. బాబుకు భవిష్యత్తులో ఊబకాయం, మధుమేహం వచ్చే అవకాశం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా పిల్లాడిని చూసుకోవాలని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగాలను అభ్యర్థించడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం నాడు రాప్తాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో "జగనన్న ఆణిముత్యాలు" పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని సమాజం గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థీ విషయ పరిజ్ఞానం మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్ రాజ్, మండల వైసీపీ కన్వీనర్ శేఖర్, జడ్పీటీసీ హేమలతతో పాటు మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

తహశీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేస్తున్న మోహన్‌నాయక్

వసతి గృహాల్లో వసతులు కల్పించాలి

గుత్తి : ప్రభుత్వ వసతి గహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహశీలార్ ఎస్.మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ వసతిగృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. చాలా వసతి గహాల ప్రహరీలు కూలిపోయాయన్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ పిల్లలు, వారి తల్లిదండ్రులు

ప్రీస్కూల్ పిల్లలతో ర్యాలీ

గుత్తి : పట్టణంలోని బిసి కాలనీలో ఉన్న 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆధ్వర్యంలో 'జన బాగీ దారీ' కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రీ స్కూల్ పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లుల సమూహాలను ఏర్పాటు చేసి పిల్లలకు ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమ్మ, జ్యోతి, మహిళా పోలీస్ అనురాధ, ఆయాలు వరలక్ష్మి, అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

బుక్కరాయసముద్రం : తమ సమస్యలు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ గురువారం కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జొన్నల గడ్డ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నల్లప్ప మాట్లాడుతూ 2005 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నామని, కావున ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణలో తమకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చి నట్లు ఆయన తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో సిఐ విజయశంకర్‌రెడ్డి, మెసెంజర్ బి.నల్లప్ప, కృష్ణమూర్తి ఉన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం

నార్పల : శింగనమల నియోజకవర్గంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఎస్‌ఆర్ఐటి కళాశాలలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ఆధ్వర్యంలో సత్కరించారు. ఇందులో భాగంగా నార్పల బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి మధుసూదన్, కేసేపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన వంశీ క్రిష్ణారెడ్డికి నగదు, మెమెంటో అందజేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు, వారు చదివిన పాఠశాల హెచ్‌ఎం లను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి బూసగాని నాగేశ్వరరావు, బండ్లపల్లి ఎంపిటిసి సభ్యులు శంకర్ యాదవ్, ఎంఇఒ కృష్ణయ్య, ఈఓఆర్డి లక్ష్మీనరసింహ, వి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు చంద్రశేఖర్, శోభారాణి, నియోజకవర్గంలోని ఎంపిడిఒలు తహశీల్దార్లు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతకు పురస్కారం

ఉరవకొండ : ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఉత్తమ రక్తదాత పురస్కారం అవార్డు అందుకున్నారు. రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని అనంతపురంలోని ఐఎంఎ ఆడిటోరియంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతలకు అవార్డులు అందజేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రక్తదానం చేయడంలో ఆదర్శంగా నిలిచిన మల్లికార్జునను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కాపు భారతిరెడ్డి, డిఎంహెచ్‌వో వీరబ్బాయి, డిసిహెచ్‌ఎస్ కృష్ణవేణి, ఆర్డీవో రవీంద్ర, అడిషనల్ డిఎంహెచ్‌ఒ అనుపమ జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి మల్లికార్జునను సన్మానిస్తున్న దృశ్యం

బిజెపివి బ్లాక్ మెయిల్ రాజకీయాలు : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక బిజెపి అగ్ర నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. విడపనకల్లు మండల పరిధిలోని హావళిగి గ్రామంలో గురువారం విశ్వ విలేకరులతో మాట్లాడారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అవినీతే జరగ డం లేదన్నట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజకీయ అవసరాల కోసం బిజెపి, టిడిపి దిగజా రుడు రాజకీయాలు, ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. టిడిపి, ఇతర ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా సీఎం జగన్‌పై కక్ష కట్టాయన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా జగన్, వైసిపి విజయాన్ని ఆపలేరన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా జగన్ పాలన సాగుతోందన్నారు.

అన్నివర్గాల ప్రజలకు మేలు : విశ్వ

ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేర్చిన జగన్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. హావళిగి గ్రామంలో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం జెసిఎస్ మండల కన్వీనర్ భరత్ రెడ్డి, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, సర్పంచి గీతమ్మ, నాయకులు కరణం భీమరెడ్డితో కలిసి విశ్వ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, ఎంపిటిసిలు కళావతి, రాజమ్మ, సుంకన్న, పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు పిఎసిఎస్ ఛైర్మన్లు నరేంద్రరెడ్డి, శ్రీరాములు, విఆర్వోలు రవితేజ, సెక్రటరీ సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హావళిగిలో గడపగడపకు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

హావళిగి గ్రామంలో రూ.8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన తాగునీటి పైపులైన్ నిర్మాణం పనులకు గురువారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. గ్రామంలోని నేసేపేట, తదితర కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా పంచాయతీ నిధులతో స్థానిక ట్యాంక్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు నూతన పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

నీటి సమస్యను తీర్చండి సారూ..

బొమ్మనహాల్ : మండల పరిధిలోని గోవిందవాడ, కళ్లుదేవనహళ్లి గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు. కళ్లుదేవనహళ్లి గ్రామంలో 300, గోవిందవాడ గ్రామంలో 2 వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. ఈ గ్రామల ప్రజలు శివరామిరెడ్డి పథకం, వేదవతిలో చేతిపంపుల ద్వారా తాగునీరు తెచ్చుకుంటున్నారు. వాడుక కోసం వారానికి ఒకసారి వదలడం వల్ల పశువులు, మనుషులకు ఇబ్బందికరంగా మారిందని, వారంలో రెండుసార్లు వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉప ఎంపిపి సొంత గ్రామంలో సైతం వారా నికి ఒకసారి నీరు వదలడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వారంలో రెండుసార్లు శివరామిరెడ్డి వాటర్ వదిలేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రజలు పగటిపూట పనులకెళ్తారని, కావున సాయంకాలం 4 నుంచి 6 గంటల వరకు నీళ్ల వదలాలని కోరారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి లోకేష్‌ను వివరణ కోరగా ప్రజల విజ్ఞప్తి మేరకే నీరు విడుదల చేయడానికి కృషి చేస్తామని దాటవేత సమాధానం ఇచ్చారు.

కొళాయి నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

ఆర్‌బికెలో విహెచ్‌ఎ మురళికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పంటల బీమా ప్రకటించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

2022-ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమాను వెంటనే ప్రకటించాలని కోరు తూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌బికెలో విహెచ్‌ఎ మురళికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ 2022-ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా అన్ని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వేరుశనగ, పత్తి, మిరప, కంది, పంట పొలాల్లోనే మొలకలు రావడంతో పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుఊబిలో కూరుకుపోయారన్నారు. కావున వెంటనే పంటల బీమా విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామంజి, మండల కార్యదర్శి వెంకటచౌదరి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సూరి, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మేరీ, రాధా, శోభారాణి, ఉలిగమ్మ, తదితరులు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ప్రభావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ పేరుతో ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఎంఎస్‌కె, తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు వేధింపులకు గురి చేయడం తగదన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద, జూలై 10వ తేదీ కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు.

సిడిపిఒ ప్రభావతికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా పొదుపు సంఘాల సభ్యులు

మెప్మా రీసోర్స్‌పర్సన్‌పై ఫిర్యాదు

రాయదుర్గం: మున్సి పాలిటీలోని పట్టణ దారిద్ర నిర్మూలన పథకం రిసోర్స్ పర్సన్ సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడుతున్నారని పలు మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులు గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్పకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 9, 10 ఎన్నికల వార్డుకు చెందిన చౌడేశ్వరీ సమాఖ్య పరిధిలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న సునీత పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులు రాయడం, సమావేశాలు నిర్వహించే సమయంలో సభ్యులను అగౌరవంగా, కించపరిచేలా, దుర్భాషలాడు తోందని పలువురు సభ్యులు పేర్కొన్నారు. అలాగే రికార్డులు రాసినందుకు ఆదనంగా డబ్బు వసూలు చేస్తోందని ఆరోపించారు. స్పందించిన ఛైర్‌పర్సన్ మరోసారి ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తప్పవని రీసోర్స్‌పర్సన్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలిబాషా, వార్డు సభ్యురాలు శారద, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, సిఒ సంధ్య, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరులో గురువారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రామకోటి కాలనీ ప్రజలు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రసాదరెడ్డిని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపిడిఒ రామకృష్ణ, మండల ఇంజనీర్ ప్రసన్నకుమార్, మండల ఉపాధ్యక్షులు బండలదిన్నె రామయ్య, ఎంపిటిసి అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, అధికారులు, ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

మండల పరిధిలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వర్థనారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో రూ. 32 లక్షల వ్యయంతో నిర్మించనున్న సాంస్కృతిక కళల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భవనం పూర్తయితే బ్రహ్మోత్సవాలు, శివరాత్రి, తదితర పర్వదినాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్రహ్మణ్యం, నారాయణస్వామి, దేవస్థానం కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, సింగిల్‌విండ్ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, హాజీ వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

నెరమెట్ల గ్రామంలో అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అతిసార నివారణపై ర్యాలీ

ఉరవకొండ: ఉధత అతిసార నివారణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని నెరమెట్ల గ్రామం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అతిసార వ్యాధిపై హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు కలుషితమై అతిసార ప్రబలే అవకాశం ఉందని, కావున చిన్న పిల్లలున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. అతిసార సోకితే సమీపంలోని వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే చేతుల శుభ్రత, ఓఆర్ఎస్ నీటిని కలిపే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లలిత, సిఒ భగవాన్‌దాస్, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో రైల్వే గేట్ మూసివేత

రాయదుర్గం: మరమ్మతుల నేపథ్యంలో రాయదుర్గం-బిటి ప్రాజెక్టు రోడ్డు మార్గంలో ఉన్న రైల్వే గేటును ఈ నెల 17, 18 తేదీల్లో మూసి వేస్తున్నట్లు నైరుతి రైల్వే మైసూరు డివిజన్ మొలకాల్మూరు విభాగం సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులూ ప్రయాణికులు, వాహన చోదకులు రాయదుర్గం-గొల్లపల్లి రోడ్డు మార్గంలో కానీ, రాయదుర్గం-అడిగుప్ప రోడ్డు మార్గంలో కానీ రాకపోకలు సాగించాలని కోరారు.

కంజిరెడ్డి ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

శింగనమల : మండల పరిధిలోని తరిమెల గ్రామంలో కంచిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంచిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో మరెన్నో ప్రజాపయోగ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తరిమెల గ్రామంలో పుట్టినందుకు రుణం తీర్చుకుంటామ న్నారు. కార్యక్రమంలో బొమ్మన శ్రీరామ్‌రెడ్డి, ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, జడ్పిటిసి కంచిరెడ్డి సుధారెడ్డి, వైసిపి నాయకులు తరిమెల రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలిరెడ్డి, మారుతి, ప్రసాద్‌కుమార్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లు : పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల పట్ల తల్లులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హరిత, అరుణ సూచించారు. పట్టణంలోని కథలవీధిలో ఉన్న 1, 2 అంగన్‌వా డీ కేంద్రాలను గురువారం వారు సందర్శించి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న మందులు, పోషకాహారంపై ఆరా తీశారు. అలాగే రక్త హీనత ఉన్న తల్లులు, పెరుగుదల తక్కువగా ఉండే పిల్లలను పరిశీలించి పిల్లల శారీరక, మానసిక వ్యక్తిత్వ వికాసంపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం రాజేంద్రనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీస్కూల్ పిల్లల తెలివి, శారీరక, భాషాభివృద్ధిపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రత్న, సుశీల, శాంతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల తల్లులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు హరిత, అరుణ

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్పొ రేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు నిబంధనలను తుంగలో తొక్కి సిబిఎస్ఇ, ఐఐటి, ఒలింపియాడ్, ఈ-స్మార్ట్, ఈ-టెక్నో, డైమండ్, తదితర నిషేధిత పేర్లతో విద్యార్థుల తల్లిదం డ్రుల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు లేని విద్యాసంస్థలు పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో తక్షణమే ఫీజులను నోటీస్ బోర్డులో ప్రదర్శించడంతో పాటు ఫీజుల దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

రైతు దారుణ హత్య

కళ్యాణదుర్గం: మండల పరిధిలోని కదరంపల్లి గ్రామానికి చెందిన రైతు కురుబ గోవిందు (45) గురువారం తెల్లవారుజామున దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గోవిందు తనకున్న 12 ఎకరాల వ్యవసాయ పొలంలో కొంత వేరు శనగ, టమోటా పంటలు సాగు చేశాడు. మరో ఐదెకరాల్లో పంట సాగు చేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. అలాగే భూమి సారవంతం (ఎరువు) కోసం అదే గ్రామానికి చెందిన వెంకటేశులుకు చెందిన గొర్రెలను పొలంలో వదిలా డు. అయితే గొర్రెల యజమాని వెంకటేశులు తన కుమారుడిని చదువు నిమిత్తం జమ్మలమడుగు కు వదిలి వస్తానని రాత్రివేళ గొర్రెలకు కాపులా ఉండాలని గోవిందుకు చెప్పి వెళ్లాడు. వెంకటేశులు భార్య నాగలక్ష్మి గొర్రెలను మేపి సాయంత్రం గోవిందు పొలం లోకి వదిలింది. దీంతో రాత్రి గోవిం దు అక్కడే కాపలాగా పడుకున్నాడు. జమ్మలమడుగు వెళ్లిన వెంకటేశులు పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. ఉదయం 6 గంటలకు గొర్రెల వద్దకు వెళ్లి చూడగా గోవిందు హత్యకు గురైనట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో చుట్టు పక్కల పొలాల్లోని రైతులు, గ్రామస్తులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోవిందుకు ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారు. ఇటీవల అన్న గుండెపోటుతో మృతి చెందాడు. ముగ్గురికీ కలిసి 38 ఎకరాల వ్యవసా య పొలం ఉంది. వీటితో పాటు అనంతపురంలో పలుచోట్ల ప్లాట్లు ఉన్నట్లు తెలుస్తోంది. హత్యకు భూ పంపకాల్లో అన్నదమ్ముల మధ్య అంతర్గత విభేదాలా, లేక వివాహేత సంబంధం కారణమా అని పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ కే.శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. గోవిందుకు భార్య పోలమ్మ, ఇద్దరు కుమారులు ప్రదీప్, ప్రకాశ్, కుమార్తె శాంతి ఉన్నారు. భార్య పోలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు గురైన కురుబ గోవిందు

పోలీసుల అదుపులో ఉన్న మట్కా నిర్వాహకులు

మట్కా నిర్వాహకులు అరెస్టు

రూ.3.52 లక్షలు స్వాధీనం

రాయదుర్గం: రాయదుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పది మంది వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 3,52,120 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వి.యుగంధర్ తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సర్కిల్ పరిధిలోని గుమ్మఘట్ట, హీరేహాల్, బొమ్మనహాల్, కణేకల్లు మండలాల్లో పలువురు గుట్టుగా ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది నిఘా ఉంచి గురువారం కణేకల్లు మండలంలో ఇద్దరు, బొమ్మనహాళ్ మండలంలో నలుగురు, డి.హీరేహాల్ మండలంలో ముగ్గురు, గుమ్మఘట్ట మండలంలో ఒకరు, మొత్తం 10మందిని అరెస్టు చేసి వారి నుంచి సెల్‌ఫోన్లు, మట్కా చీటీలు, ఇతర సామగ్రి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మట్కా జూదరులను అరెస్టు చేసిన ఎస్సైలు బి.దుగ్గిరెడ్డి, జి.రంగడు, ఏ.సునీత, పోలీసు సిబ్బందిని అభినందించారు.

దూసుకొచ్చిన లారీ.. మూడు గొర్రెలు మృతి

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడు వద్ద 67వ జాతీయ రహదారిపై గురువారం రోడ్డు దాటుతున్న గొర్రెల మందపైకి లారీ వేగంగా దూసుకురావడంతో మూడు గొర్రెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన రమేష్ తన గొర్రెల మందను రోడ్డు దాటిస్తున్న తరుణంలో అటుగా వచ్చిన లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఢీకొంది. దీంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి.

దండు శ్రీనివాసులును గజమాలతోసత్కరిస్తున్న అభిమానులు

మహిళలకు చీరలు పంపిణీ

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పుట్టినరోజు సందర్భంగా గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అంతకుముందు స్థానిక రామాలయం వద్ద నుంచి పెద్దఎత్తున డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా పేలుస్తూ దర్గా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేకు కోసి రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నర్సానాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో దాసరి గంగాధర, కుళ్లాయప్ప, ఎం.ఆదినారాయణ, మహమ్మద్ గౌస్, బండి పరశురాం, బ్యాళ్ల సుదర్శన్, అట్టే శీన, బెస్త నారాయణస్వామి, నరసింహ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేని సచివాలయాలు

పుట్లూరు : మండల పరిధిలోని పలు సచివాలయాలకు మరుగుదొడ్లు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామ సచివాలయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. సచివాలయ సిబ్బంది ఊరి బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలని సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

నిఘా మరియు నాణ్యత, నియంత్రణ పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయము

అనంతపురం చిట్ టెండర్ ప్రకటన నెం.01/ఏ.టి.ఓ/2023-24, తేది:15-06-2023

కార్యనిర్వాహక ఇంజనీరు, నిఘా మరియు నాణ్యత నియంత్రణ, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయము, ఉమ్మడి అనంతపురము జిల్లా పరిధి నందు జరిగిన పనులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి ఆధ్వర్యంలో పర్యవేక్షించుటకు గాను అర్హత కలిగిన వాహనము (ఎ.సి) ఇన్నోవా, మహేంద్ర, తవేరా, బొలేరో, తరహా వాహనముల యజమానుల నుండి టెండరులు ఆహ్వానించడమైనది. జి.ఓ.యం.యస్.నెం.87, తేది:01-06-2017 ఫైనాన్స్ (MR-II TFRUA) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నందు తెలుపబడిన నిబంధనలు ప్రకారము టెండరు జరుపబడును. ఆసక్తి ఉన్న వాహన యజమానుల నుండి సీల్డ్ వేసిన టెండరులు ఆహ్వానించబడుచున్నవి. టెండరు షెడ్యూలు కొరకు దిగువ తెలిపిన డివిజన్ కార్యాలయము & సబ్-డివిజన్ కార్యాలయములందు సంప్రదించవలెను.

టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తు స్వీకరించు తేది	20-06-2023 సాయంత్రం 05:00 గంటల వరకు
టెండరు షెడ్యూలు జారీచేయు తేది	22-06-2023 సాయంత్రం 05:00 గంటల వరకు
టెండరు షెడ్యూలు స్వీకరించు తేది	24-06-2023 సాయంత్రం 03:00 గంటల వరకు
మరియు టెండరు తెరుచు తేది	24-06-2023 మధ్యాహ్నం 03:30 గంటలకు

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
విజిలెన్సు మరియు క్వాలిటీ కంట్రోల్
పి.ఆర్. సబ్-డివిజన్, అనంతపురము 1& 2,
కదిరి మరియు పెనుకొండ.

కె.మల్లికార్జునమూర్తి
కార్యనిర్వాహక ఇంజనీరు
నిఘా మరియు నాణ్యత నియంత్రణ
(పి.ఆర్.) డివిజన్, అనంతపురము.